క్లుప్తంగా

పంచాయతీ సిబ్బంది భిక్షాటన



భిక్షాటన చేస్తున్న పంచాయతీ సిబ్బంది

యాచారం: సమ్మెలో భాగంగా పంచాయతీ కార్మికులు ఆదివారం తాడిపర్తి గ్రామంలో భిక్షాటన చేశారు. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పారిశుద్ధ్యం పనులు చేస్తున్న తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. తమ న్యాయమైన సమస్యలు పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ప్రభుత్వం తమ సమస్యలపై నిర్లక్ష్యం చేస్తే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పంచాయతీ కార్మికుల నిరసన



మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

మంచాల: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జీపీ కార్మికులు చేస్తున్న సమ్మె ఆదివారం 11వ రోజుకు చేరింది. దీంతో పంచాయతీ కార్మికులు మోకాళ్లపై కూర్చొని వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గ్యార పాండు, సీఐటీయూ మండల కన్వీనర్ కృష్ణ, నాయకులు భాస్కర్, జంగయ్య, శంకరయ్య, సురేష్, నర్సింహ, సురేష్, భారతమ్మ, మల్లేశ్, యాదయ్య, మల్లమ్మ పాల్గొన్నారు.

ఏసీపీ రంగస్వామిని కలిసిన నాయకులు



కడ్తాల్: షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామిని కలిసిన నాయకులు

కడ్తాల్: షాద్‌నగర్ ఏసీపీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన రంగస్వామిని, ఆదివారం ఆమనగల్లు మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ అనంతరెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు నారాయణ, ఎంపీటీసీ సభ్యుడు లచ్చిరామ్‌నాయక్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏసీపీకి వారు శుభాకాంక్షలు తెలిపి, సన్మానించారు.

వంట సామగ్రి బహూకరణ



వంట సామగ్రిని అందజేస్తున్న శ్రీశైలం

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని జిన్నాయిగూడ లక్ష్మీనరసింహా స్వామి ఆలయానికి రావిర్యాలకు చెందిన భక్తుడు నక్క శ్రీశైలం యాదవ్ ఆదివారం వంట సామగ్రిని బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ శివశంకర్ మాట్లాడుతూ.. ఆలయానికి వచ్చే భక్తులకు అన్నం వండేందుకు వంట సామగ్రి ఉపయోగపడుతాయన్నారు. దాతలు ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీకాంత్, యాదయ్య, ఐలయ్య, సురేష్ పాల్గొన్నారు.



యాచారం: నందివనపర్తిలో బోనాల ఊరేగింపు



తుర్కయంజాల్ : ఉత్సవాల్లో పాల్గొన్న డీసీసీబీ వైస్ చైర్మన్ సత్తయ్య

బోనం సమర్పయామి

బోనాల సంబురాలు ఘనంగా జరిగాయి. ఆదివారం నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయాలకు చేరుకొని అమ్మవారికి నేవేధ్యాలు సమర్పించారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, డప్పుల దరువులతో గ్రామాలు సందడిగా మారాయి. వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండాలని అమ్మవారని వేడుకున్నారు. –సాక్షి నెట్ వర్క్



ఇబ్రహీంపట్నం రూరల్: బోనాల ఊరేగింపు

బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని వినతి



ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కడ్తాల్: ఆమనగల్లు మండలంలోని మంగల్‌పల్లి–చెన్నారం గ్రామాల మధ్య ఉన్న వాగుపై వంతెన నిర్మాణం చేపట్టాలని ఆదివారం వైస్‌ఎంపీపీ జక్కు అనంతరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక నాయకులు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి ప్రజలు, రైతులు, ఎదుర్కొంటున్న ఇబ్బందులను సీఎం కేసీఆర్‌ను కలిసి రిప్రెజెంటేషన్ అందించడం జరిగిందని, బ్రిడ్జి నిర్మాణానికి రూ.కోటి యాభై లక్షల నిధులు మంజూరు చేయాలని కోరడం జరిగిందని ఎమ్మెల్యే చెప్పారు. సీఎం బ్రిడ్జి నిర్మాణానికి సానుకూలంగా స్పందించారని, అతి త్వరలోనే నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభిస్తామని మంగల్‌పల్లి గ్రామస్తులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాడ్గుల్ వైస్‌ఎంపీపీ శంకర్‌నాయక్, రైతుబంధు మండల అధ్యక్షుడు నారాయణ, ఎంపీటీసీ లచ్చిరామ్‌నాయక్, బీఆర్ఎస్ మాడ్గుల్ మండల అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, యూత్ వింగ్ ప్రెసిడెంట్ మహేశ్, నాయకులు మురళీ, సత్యనారాయణ, వెంకటేశ్ ఉన్నారు.

చంద్రయాన్-3 విజయవంతంపై హర్షం

తలకొండపల్లి: భారత దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన ఇస్రో శాస్త్రవేత్తలను యావత్తు భారత దేశ ప్రజలు అభినందిస్తున్నారని బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ , ఉప సర్పంచ్ అనిల్ అన్నారు. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి చంద్రయాన్–3ని అంతరిక్ష కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టడంపై అనిల్ హర్షం వ్యక్తం చేశారు. ఇస్రో చైర్మన్, శాస్త్రవేత్తలు, ఇతర సాంకేతిక సిబ్బందికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. చంద్రయాన్–3తో భారత అంతరిక్ష పరిశోధన రంగం కీలక మైలురాయి దాటిందని పేర్కొన్నారు. శనివారం రాత్రి మండల కేంద్రంలోని విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. జయహో చంద్రయాన్–3 అంటూ విద్యార్థులు జాతీయ జెండాను ప్రదర్శించి దిక్కులు పిక్కటిల్లేలా నినదించారు. ప్రధాని మోడీ హయాంలో భారత దేశం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం హనుమంతు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.



వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు

సమస్య పరిష్కరించే వరకు బిల్లులు చెల్లించం



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

కందుకూరు: తమ గ్రామంలో విద్యుత్ సమస్య పరిష్కరించే వరకు బిల్లులు చెల్లించేది లేదని మండలంలోని సరస్వతిగూడ గ్రామస్తులు ఆదివారం విద్యుత్ సిబ్బందికి తేల్చి చెప్పి బిల్లులు చెల్లించకుండా నిరసన తెలిపారు. గ్రామానికి అటవీ భూముల నుంచి ఏర్పాటు చేసిన వ్యవసాయ విద్యుత్ లైన్ల ద్వారా గ్రామంలోని ఇళ్లకు విద్యుత్ సరఫరా చేస్తున్నారు. దీంతో గత రెండు నెలలుగా చిన్నపాటి వర్షం కురిసినా కరెంట్ సరఫరా నిలిచిపోతుందని గ్రామస్తులు వాపోతున్నారు. రాత్రి పోతే తెల్లవారే దాక మళ్లీ రావడం లేదని ఆరోపిస్తున్నారు. తామంతా వంద శాతం విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నామని, ఇళ్లకు వేరుగా లైన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఇకపై బిల్లులు చెల్లించేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే లక్ష్యంగా కృషి

సర్పంచ్ సురేష్



సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న సురేష్

మహేశ్వరం: గ్రామాల్లో మౌలిక వసతులను కల్పించి అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని సిరిగిరిపురం సర్పంచ్ కాసుల సురేష్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని సిరిగిరిపురంలోని 3వ, 4వ వార్డుల్లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను వార్డు సభ్యులు, గామస్తులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గ్రామంలో ప్రతి వార్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులతో పాటు, ప్రతి వీధి స్తంభానికి ఎల్ఈడీ లైట్లు, పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. వార్డు సభ్యులు, గ్రామ పెద్దల సహకారంతో గ్రామంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ఆదర్శవంతమైన గ్రామంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కాలనీల్లోకి ఓవర్ లోడ్ లారీలను నిషేధించాలి

హస్తినాపురం: హస్తినాపురం సాగర్ రహదారి పరిసర ప్రాంతాల్లోని కాలనీల్లో ఉన్న రోడ్లన్నీ కుంగిపోవడానికి కారణమైన ఓవర్‌లోడ్ లారీలను కాలనీల్లోకి రాకుండా పూర్తిగా నిషేధించాలని సెంటర్ ఫర్ సోషియో కల్చర్ ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ సీఈఓ సన్ని హెరాక్లియస్ డిమాండ్ చేశారు. హస్తినాపురంలోని తెలంగాణ చౌరస్తాలో 60 టన్నుల ఓవర్ లోడ్‌తో వెళ్తున్న లారీ ఆదివారం అకస్మాత్తుగా రిపేరు వచ్చి నిలిచిపోయిందని, ఇలాంటి లారీలు కాలనీల్లోకి రావడంతోనే రోడ్లన్నీ కుంగిపోతున్నాయని ఆయన అన్నారు. ఇలాంటి వాటిని కాలనీల్లోకి రాకుండా ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

దాడి అవాస్తవం

చేవెళ్ల: మల్కాపూర్‌లో సర్పంచ్ అనుచరులు ఓ దళిత వ్యక్తిపై దాడి చేసి కులం పేరి ట దూషించినట్లు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని.. రాజకీయ కక్షలతోనే ఫిర్యాదు చేశారని గ్రామస్తులు పోలీసులకు వివరించారు. ఆదివారం గ్రామానికి చెందిన అన్ని వర్గాల ప్రజలు చేవెళ్ల ఏసీపీ, సీఐను కలిశారు. బోనాల ఉత్సవాల సందర్భంగా గ్రామానికి చెందిన సంజీవ ఊరేగింపులో డ్యాన్స్ చేస్తూ ఇబ్బంది కలిగించాడు. దీంతో అతన్ని నిలువరిస్తుండగా స్వల్ప తోపులాట జరిగింది.. దీంతో ఆ వ్యక్తికి గ్రామస్తులు సర్ది చెప్పడంతో అక్కడి నుంచి వెళ్లిపోయాడు. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు సర్పంచ్ శేరి శివారెడ్డి రాజకీయ భవిష్యత్‌ను దెబ్బతీసేందుకు సంజీవతో ఫిర్యాదు చేయించారని దళిత వర్గానికి చెందిన వారు పోలీసులకు వివరించారు.

పరామర్శించిన ఎమ్మార్పీఎస్ నాయకులు

సంజీవపై దాడి జరిగిందని సమాచారం అందుకు మహాజన్ సోషలిస్టు పార్టీ నాయుడు మద్దిలేటి క్యాసారం శంకర్‌రావు, ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ నర్సింహ, నియోజకవర్గ కన్వీనర్ ప్రవీణ్‌కుమార్ ఆదివారం బాధితుడిని పరామర్శించి విషయం తెలుసుకున్నారు.

ట్రాఫిక్ ఇక్కట్లు

- రోడ్డుకు ఇరువైపులా వాహనాల పార్కింగ్
- పుట్టినరోజులు, జయంతులు, వర్ధంతులతో జఠిలం

కడ్తాల్: మండల కేంద్రంలో శ్రీశైలం–హైద్రాబాద్ ప్రధాన రహదారిపై ప్రైవేట్ వాహనాలు రోడ్డుపై నిలపడంతో, పాదచారులు, ప్రయాణికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. దీనికి తోడు వివిధ పార్టీల ఆధ్వర్యంలో తరుచూ ప్రధాన రహదారిపై దేశ నాయకుల జయంతి, వర్ధంతులతో పాటు స్థానిక నాయకుల పుట్టిన రోజు వేడుకలను నిర్వహిస్తుండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు మరింత ఎక్కువయ్యాయి. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై డివైడర్ ఏర్పాటు చేసి నాలుగులైన్ల రహదారిగా ఏర్పాటు చేశారు. రోడ్డుకు కిరువైపులా వాహనాలు నిలుపడానికి పుట్‌పాత్ ఏరియా కూడా ఏర్పాటు చేశారు. పుట్‌పాత్ ఏరియాలో చిరువ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో ప్రైవేట్ వాహనదారులు రోడ్డుపైనే వాహనాలు నిలిపి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. ఆటోలు, క్రూయిజర్‌లు, ద్విచక్రవాహనాలు రోడ్డుపైనే నిలుపుతుండటంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. అసలే రోడ్డుకిరువైపులా ఏర్పాటు చేసిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీపై ప్రైవేట్ వ్యాపారులు షెడ్డులు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు చేస్తుండడంతో పాదచారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

తరుచూ ట్రాఫిక్ సమస్యలు

రోడ్డుపైనే నిలుపుతున్న క్రూయిజర్ ఆటోలు, బైక్‌లు నిలిపి ఉంచడంతో తరుచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. మండల కేంద్రంలో రోడ్డు కిరువైపులా షాపింగ్ కేంద్రాలు, హోటల్స్ ఉండటంతో, వినియోగదారులు తమ బైక్‌లను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తుండడంతో రాకపోకలు సాగించే వాహనాలు ట్రాఫిక్ ఇక్కట్లకు గురవుతున్నాయి. ప్రయాణికులు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకోని ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



కడ్తాల్‌లో రోడ్డుపైనే నిలిపిన వాహనాలు



రోడ్డుపై పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలు

చర్యలు తీసుకుంటాం..



జాతీయ రహదారిపై వాహనాలు నిలిపి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. గతంలో రోడ్డుపై వాహనాలు నిలిపిన పలువురి వాహనదారులపై కేసులు నమోదు చేశాం. రహదారికి ఇరువైపులా ఉన్న వ్యాపార సముదాయల ముందు, రహదారిపై వాహనాలు నిలిపి ఉంచడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రైవేట్ వాహనదారులు రహదారిపై వాహనాలు పార్కింగ్ చేస్తే కేసులు నమోదు చేస్తాం. ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేకంగా ట్రాఫిక్ పోలీసులను ఏర్పాటు చేస్తాం.

–హరిశంకర్‌గౌడ్, ఎస్ఐ, కడ్తాల్

అనుచిత వ్యాఖ్యలపై ఆగ్రహం

ఇబ్రహీంపట్నం రూరల్: ముదిరాజ్ కులస్తులపై మాజీ సర్పంచ్ యాదగిరిగౌడ్ చేసిన వ్యాఖ్యాలకు ముదిరాజ్‌లు మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్ పట్టణంలో ఆదివారం నిరసనగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం దిష్టిబొమ్మను ఊరేగించి దహనం చేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ నాయకులు మాట్లాడుతూ.. కొంగరకలాన్‌లోని లక్ష్మీ నర్సింహాస్వామి దేవాలయం విషయంలో ముదిరాజ్‌ల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతిసేలా , ముదిరాజ్‌లకు దమ్ముధైర్యం లేనందున మన వర్గం చైర్మన్ పదవీనికై వసం చేసుకున్నామని అహంకార పూరిత మాటలు మాట్లాడటం తగదన్నారు. 24 గంటల్లో ముదిరాజ్‌లకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో నేడు ఇబ్రహీంపట్నం మండలం కేంద్రంలో ఆందోళన చేపడతామని , రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోతామని హెచ్చరించారు. అనంతరం ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు పరమేశ్, నారాయణ, వేణుగోపాల్, మధు, మహేందర్, గోదాసు విద్యాసాగర్, లక్ష్మణ్, రాఘవేందర్, నాగేష్, సంఘం నాయకులు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ముదిరాజ్‌లు

కాంగ్రెస్ గెలుపునకు యువతే కీలకం

పీఏసీఎస్ మాజీ చెర్మన్ సుదర్శన్‌రెడ్డి



శివారెడ్డికి నియమాకపత్రం అందజేస్తున్న సుదర్శన్‌రెడ్డి

యాచారం: కాంగ్రెస్ గెలుపునకు యువత కృషి ఎంతో ముఖ్యమని మండల మాజీ పీఏసీఎస్ చైర్మన్ నాయిని సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆదివారం యువజన కాంగ్రెస్ సమావేశం యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గొరారం వెంకట్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించేలా యువత కృషి చేయాలని సూచించారు. సమష్టి కృషితోనే కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్నారు. అనంతరం యాచారం గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా గొరారం శివారెడ్డిని, ప్రధాన కార్యదర్శిగా గణేష్‌ను నియమించారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహ, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్, నాయకులు సంపత్‌కుమార్, అఖిల్, సుదీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండల హోదా ఇచ్చే వరకు దీక్షలు



రిలే నిరాహార దీక్షలు, ధర్నాలు చేస్తున్న జేఏసీ నాయకులు, తదితరులు

రాజీనామా చేస్తున్నట్లు వార్డు సభ్యుల ప్రకటన

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండలం కేంద్రంగా ప్రకటించేంతవరకు దీక్షలు కొనసాగుతాయని జేఏసీ నాయకులు అన్నారు. ఆదివారం జేఏసీ నాయకులు చేపట్టిన నిరాహార దీక్షలు 14 రోజుకు చేరాయి. దీక్షలో భాగంగా వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు గట్టుఇప్పలపల్లిలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించకపోతే మా పదవులకు రాజీనామా చేస్తున్నట్లు వార్డు సభ్యులు ప్రకటించారు. 1 నుంచి 12 వార్డు సభ్యులు రాజీనామా చేసి ఎంపీడీఓకు వినతిపత్రాలను అందజేస్తామని తెలిపారు. గతంలో 41 రోజులు దీక్షలు చేశామని, ప్రస్తుతం దీక్షలు చేపట్టి 14 రోజులుగా కొనసాగుతున్న ప్రభుత్వం కనీసం స్పదించడం లేదన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి మండలం ఏర్పాటు చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు దీక్షలు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాసురెడ్డి, బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, డేవిడ్, గౌడసంఘం తాలూకా కన్వీనర్ అశోక్‌గౌడ్, పవన్‌వాల్మీకి, కృష్ణయ్య, రేణురెడ్డి, శ్రీను, మల్లయ్య, కొండల్, పురుషోత్తం, రాధాకృష్ణ, జంగయ్య, నరహరి, చెన్నయ్య, మైసయ్య, మాజీసర్పంచ్ జంగమ్మ పాల్గొన్నారు.

హాస్టళ్లలో మెరుగైన వసతులు కల్పించండి

ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు విప్లవ్‌కుమార్



విద్యార్థులతో మాట్లాడుతున్న విప్లవ్‌కుమార్

యాచారం: సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చదువుకునే విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు విప్లవ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని నందివనపర్తిలోని వసతి గృహాన్ని ఆదివారం ఎస్ఎఫ్ఐ బృందం సందర్శించి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం హాస్టళ్లను పట్టించుకోకపోవడంతో మూతపడే అవకాశం ఉందని అన్నారు. గతంలో వేలాది మంది విద్యార్థులు చదువుకున్న నందివనపర్తి, నక్కర్తమేడిపల్లి వసతి గృహాలను పట్టించుకునే నాథుడే లేరని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు యుగేందర్, సాయికుమార్, మనీష్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేశ్

నందిగామ: నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తోందని జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేశ్ అన్నారు. పంచాయితీ పరిధిలోని బండకుంట తండాలో ఆదివారం జెడ్పీవైస్ చైర్మన్ రేషన్ దుకాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తండా వాసులు ప్రతీ నెల రేషన్ సరుకులు తీసుకునేందుకు కిలో మీటర్ల మేర నడుచుకుంటూ వెళ్లి ఇబ్బంది పడే వారని.. గిరిజనుల సమస్యను సర్పంచ్ వెంకట్‌రెడ్డి ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే తండాకు రేషన్ షాపును కేటాయించారన్నారు. ఇప్పటి నుంచి ప్రతీ నెల రేషన్ సరుకులు తండాలోనే తీసుకోవచ్చని తండావాసులకు ఆయన సూచించారు. రేషన్ షాపు ఏర్పాటు చేయడంపై గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకట్‌రెడ్డి, ఉప సర్పంచ్ కుమార్‌గౌడ్, తండా వాసులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



రేషన్ షాపును ప్రారంభిస్తున్న గణేశ్

సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమిద్దాం

మాదాసి కురుమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివరాములు

షాద్‌నగర్: సమస్యల సాధనకు మాదాసి కురుమలందరూ ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నత్తి శివరాములు అన్నారు. పట్టణ పరిధిలో ఉన్న గాంధీనగర్ కాలనీలోని ఉన్న సహకార సంఘ భవనంలో ఆదివారం కురుమ సంఘం నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన శివరాములు మాట్లాడుతూ.. మాదాసి కురుమల ఆర్థిక, సామాజిక, రాజకీయ విద్యా రంగాల్లో రాణిస్తేనే సమస్యలు పరిష్కరించబడుతాయన్నారు. మాదాసి కురుమలకు ఎస్సీ ధృవీకరణ పత్రాలు జారీ చేయాలని ఏళ్ల నుంచి పోరాటం చేస్తున్నా ప్రభుత్వం సంద్పించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మనమంత కలిసికట్టుగా ఉంటూ సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని సూచించారు. అనంతరం సంఘం తాలుకా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సిందం వితలయ్య, గౌరవాధ్యక్షులుగా బండ వెంకటేశ్, నర్సింలు, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మయ్య, సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులను సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట కోశాధికారి శ్రీనివాసులు, సత్తయ్య, మల్లేశ్, కుమార్, జంగయ్య, అర్జున్, శివలింగం, శ్రీను, లక్ష్మయ్య, మల్లేశ్, రాములు, సత్యనారాయణ, రాజు, శివకుమార్, సత్తయ్య, బీరప్ప పాల్గొన్నారు.



నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న నాయకులు